సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 19 । ఆగస్టు । 2025



శిక్షణతో ఖ్యాతి

పొందూరు ఏఎఫ్‌కేకేకు చక్కటి అవకాశం వచ్చింది. శిక్షణ కేంద్రం ఏర్పాటుకు చాన్స్ దొరికింది.

- 8లో

నేడు అన్ని పాఠశాలలకు సెలవు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అల్పపీడనం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు మంగళవారం కూడా సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. విద్యార్థుల రక్షణ, భద్రత దృష్ట్యా ముందస్తుగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు సంబంధిత జిల్లా అధికారుల ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు.

జలమయమైన ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ



న్యూస్‌రీల్

జోనల్ స్థాయి క్రీడా పోటీలు వాయిదా

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని శాప్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో విశాఖపట్నంలో జరగాల్సిన జోనల్‌స్థాయి క్రీడాపోటీలు వాయిదా పడ్డాయి. తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాల కారణంగా పోటీలను అధికారులు వాయిదా వేసినట్టు డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్ రావు తెలిపారు. తదుపరి తేదీలను త్వరలో వెల్లడిస్తామని, ఎంపికైన క్రీడాకారులంతా విషయాన్ని గుర్తించాలని ఆయన సూచించారు.

డీపీటీఓగా అప్పలనారాయణ



బాధ్యతలు స్వీకరించిన అప్పలనారాయణ

శ్రీకాకుళం అర్బన్: జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారిగా సీహెచ్ అప్పలనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇటీవల ప్రభుత్వం అమలు చేసిన శ్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణంలో మహిళలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సకాలంలో బస్సులు నడుపుతామని అన్నారు.

కురుడు పశువైద్యాధికారికి రాష్ట్రస్థాయి అవార్డు



కురుడు పశు వైద్యాధికారి కిరణ్‌కుమార్

టెక్కలి: రాష్ట్ర స్థాయిలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ అవార్డుకు కోటబొమ్మాళి మండలం కురుడు పశు వైద్య కేంద్రం పశు వైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ ఎంపికయ్యారు. క్షేత్ర స్థాయిలో ఉత్తమ పశు వైద్య సేవలు అందజేసినందుకు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 20న విజయవాడలో నిర్వహించనున్న అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో జోన్-1 విభాగంలో కిరణ్‌కుమార్ అవార్డు అందుకోనున్నారు. ఈ మేరకు టెక్కలి డివిజన్ పశు వైద్య సిబ్బంది అభినందించారు.

'దళారులను నమ్మి మోసపోవద్దు'



జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కోర్టుల పరిధిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైందని, ఈ నియామక పరీక్షల విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. స్టెనోగ్రాఫర్ గ్రేడ్-ఐఐఐ, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఫీల్డ్ అసిస్టెంట్, డ్రైవర్, ప్రాసెస్ సర్వర్, ఆఫీస్ సబార్డినేట్, కాపీయిస్ట్, ఎగ్జామినర్, రికార్డ్ అసిస్టెంట్ తదితర ఉద్యోగాల భర్తీ కోసం ఇప్పటికే కంప్యూటర్ ఆధారిత పరీక్షల షెడ్యూల్ విడుదల చేశామని తెలిపారు. ఈ నెల 20 నుంచి 24 వరకు నాలుగు పరీక్షా కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు జరగనున్నాయని వివరించారు. అభ్యర్థులు కేవలం మెరిట్ ఆధారంగానే ఎంపిక అవుతారని, డబ్బు లేదా సిఫారసుతో ఉద్యోగాలు సాధ్యం కాదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. కొంతమంది దళారులు తప్పుడు హామీలు ఇస్తూ అభ్యర్థులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి మోసపూరిత చర్యలకు ఎవరైనా పాల్పడితే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ పరీక్షలు జీఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రాజాం, శ్రీ శివాని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ చిలకపాలెం, శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎచ్చెర్ల, కోర్ టెక్నాలజీస్ గొట్టిపల్లి నరసన్నపేట కేంద్రాల్లో జరుగుతాయని తెలియజేశారు.

కూన రాజ్యంలో..

కీచక పర్వం!



ఆత్మహత్యాయత్నానికి పాల్పడి రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేజీబీవీ ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య

- ఎమ్మెల్యే కూన రవికుమార్ వేధించారంటూ కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య ఆత్మహత్యాయత్నం
- టీడీపీ శ్రేణుల దుష్ప్రచారంతో మనస్తాపానికి గురై చనిపోవాలని నిర్ణయం
- చావు బతుకుల మధ్య రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స
- రవికుమార్ నుంచి ప్రాణహాని ఉందని పోలీసులను ఆశ్రయించిన మరో బాధితుడు సురేష్
- రక్షణ కోసం కుటుంబ సభ్యులతో కలిసి పోలీసు స్టేషన్‌లోనే సురేష్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

మనిషిని కించపరిచేలా ఘోరమైన ఆరోపణలు, వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ సోషల్ మీడియా నిండా పోస్టులు, మహిళ అన్న సంగతి మర్చిపోయి వికృత ప్రచారాలు.. టీడీపీ వర్గాల ఈ వేధింపులు తాళలేక పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య ఏకంగా చనిపోవడానికి సిద్ధమయ్యారు. ఈ విష చేష్టలకు తట్టుకోలేక సోమవారం ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. దీంతో ఎమ్మెల్యే కూన రవికుమార్, ప్రిన్సిపాల్ సౌమ్య మధ్య జరుగుతున్న వివాదం మరింత రాజుకుంది. ఇదే సమయంలో ఆమెకు అండగా నిలుస్తూ, ఆస్పత్రిలో పరామర్శ కోసం వచ్చిన టీడీపీ కార్యకర్త, ఎమ్మెల్యే కూన రవికుమార్ మరో బాధితుడు సనపల సురేష్‌ను కొంతమంది వెంబడించి, తన కారును అడ్డుకోవడానికి ప్రయత్నించారు. దీంతో ఆయన వారి నుంచి తప్పించుకుని నగరంలోని పలు వీధుల గుండా టూటౌన్ పోలీసు స్టేషన్‌కు చేరుకుని, ఎమ్మెల్యే రవికుమార్ తనను చంపించేందుకు ప్రయత్నిస్తున్నారని, పోలీసులు, ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. విషయం తెలుసుకున్న ఆయన భార్య, ఇద్దరు పిల్లలు కూడా పోలీసు స్టేషన్‌కు చేరుకుని, తమకు ప్రాణహాని ఉందని, పోలీసులు, అధికారులు చర్యలు తీసుకోకపోతే కుటుంబ సభ్యులమంతా ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. సోమవారం రాత్రి వరకు పోలీసు స్టేషన్‌లోనే ఉన్నారు. ఈ రెండు ఘటనలు జిల్లాలో కలకలం రేపాయి.



మనస్తాపానికి గురై..

తనను వేధించడమే కాకుండా రాత్రిపూట వీడియో కాల్స్ చేసి ఇబ్బంది పెట్టారని కేజీబీవీ ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య వెల్లడించిన నాటి నుంచి ఆమెపై విష ప్రచారం మొదలైంది. సౌమ్య కుటుంబ సభ్యుల్ని టార్గెట్ చేసి సోషల్ మీడియాలో, ప్రెస్‌మీట్‌లలో టీడీపీ శ్రేణులు ప్రకటనల దాడిని పెంచాయి. సౌమ్య సోదరి, సోదరుడిపై దుష్ప్రచారానికి ఒడిగట్టారు. ఇదే సమయంలో తనను అన్యాయంగా బదిలీ చేశారని ఆవేదన చెందుతూ ఆరోపణలు సంధిస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ అధికారుల నుంచి సూటి పోటి మాటలు రావడం, సామాజిక వర్గం పరంగా రెచ్చగొట్టడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ వికృత ప్రచారాన్ని చూసి భరించలేక మనస్తాపానికి గురై ఆమె సోమవారం ఉదయం అధిక సంఖ్యలో బీపీ స్టెరాయిడ్ మాత్రలు, మరికొన్ని మాత్రలు కలిపి మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఓ టీవీ చానెల్‌తో మాట్లాడుతుండగా ఒక్కసారిగా పక్కకు పడిపోవడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె ఎమర్జెన్సీ వార్డులో చావు బతుకుల మధ్య చికిత్స పొందుతున్నారు.

సౌమ్య ఆత్మహత్యాయత్నం చేసుకోవడంతో జిల్లా ఉలిక్కిపడింది. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, దళిత సంఘాలు ఆమె ఇంటికి వెళ్లి అండగా నిలుస్తున్నాయి. ఎమ్మెల్యేతో పోరాడుతున్న సౌమ్యకు మద్దతుగా ఉంటామంటూ సానుభూతిని తెలియజేస్తున్నాయి. ఎమ్మెల్యేతో పోరాడుతున్న మహిళ క్షేమంగా ఉండాలని అండగా నిలిచిన వారంతా కోరుకోవడమే కాకుండా చికిత్స పొందుతున్న రిమ్స్ ఆసుపత్రికి వచ్చి పరామర్శించారు.

ప్రాణహాని ఉందంటూ..



ఎమ్మెల్యే కూన రవి నుంచి ప్రాణహాని ఉందని పోలీస్ స్టేషన్‌లో ఉన్న సనపల సురేష్ కుటుంబం

ఆమదాలవలస నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు, అడ్డగోలు రవాణాపై మొదటి నుంచి టీడీపీలో ఉంటూ ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై సనపల సురేష్ అనే కార్యకర్త పోరాడుతున్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక దందాను అడ్డుకోవడమే కాకుండా సమాజానికి తెలియజేస్తున్నాడని గతంలో బూర్జ మండలం నారాయణపురం వంతెన వద్ద సనపల సురేష్‌పై కొంతమంది దాడి చేశారు. వీరంతా ఎమ్మెల్యే కూన రవి అనుచరులేనని సురేష్ అప్పట్లో ఫిర్యాదు కూడా చేశారు. ఆ తర్వాత ఆమదాలవలస మండలం దూసిలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోవడానికి ప్రయత్నించాడని సనపల సురేష్‌ను అక్కడి నుంచి శ్రీకాకుళం నగరంలోని బలగ వరకు వెంబడించి వీరంగం సృష్టించారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ అనుచరులే తనను చంపడానికి దాడి చేశారని సురేష్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. తాజాగా పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్యను ఎమ్మెల్యే రవికుమార్ వేధింపులకు గురి చేస్తున్నారని మీడియా ద్వారా తెలుసుకుని, ఆమెను పరామర్శించి ఇంటికి వెళ్తున్న సమయంలో కొందరు వ్యక్తులు ఆయన్ని కారులో వెంబడించడమే కాకుండా మార్గమధ్యలో అడ్డుగా నిలిచారు. భయాందోళనకు గురైన సురేష్ నగరంలోని పలు వీధుల గుండా టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని, ఎమ్మెల్యే రవికుమార్ నుంచి ప్రాణహాని ఉందని, తనను చంపేందుకు ప్రయత్నిస్తున్నారని పోలీసు స్టేషన్‌లో రక్షణ కోరారు. వెంటనే ఆయన భార్య, తన ఇద్దరు పిల్లలు కూడా పోలీసు స్టేషన్‌కు చేరుకుని రక్షణ కోసం ఇక్కడే ఉంటామని చెప్పి వేచి ఉన్నారు. దీంతో పోలీసులు ఇరకాటంలో పడ్డారు.

'ఇది దళిత వ్యతిరేక ప్రభుత్వం'



రేజేటి సౌమ్యను పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్ తదితరులు

శ్రీకాకుళం క్రైమ్ : తండ్రి పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఓ మహిళా ఉద్యోగిని, అందునా దళితురాలిని మానసికంగా వేధిస్తుంటే ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ఆమదాలవలస వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ ప్రశ్నించారు. దీన్ని బట్టే చంద్రబాబు ప్రభుత్వం దళిత వ్యతిరేక ప్రభుత్వమని చెప్పొచ్చన్నారు. సోమవారం ఉదయం జిల్లా కేంద్రంలోని తిలక్ నగర్‌లో నివాసముంటున్న పొందూరు కేజీబీవీ మహిళా ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. విషయం తెలిసి రిమ్స్‌కు చేరుకున్న చింతాడ రవి బాధితురాలు సౌమ్యను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ ఒంటరి దళిత మహిళపై ఇంతటి అరాచకం చేస్తుంటే చంద్రబాబు ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. దళితులంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు మొదటి నుంచీ చిన్న చూపేనని.. అసెంబ్లీ సాక్షిగా దళితులుగా ఎవరైనా పుట్టాలని అనుకుంటారా అన్న చంద్రబాబు మాటలే అందుకు నిదర్శనమన్నారు. తనకు జరిగిన అన్యాయంపై ఆమె పోరాడుతుంటే ఎమ్మెల్యే ఇలా వేధింపులకు పాల్పడడం సరి కాదన్నారు. ఐదురోజులుగా ఆమె కలెక్టర్‌కు, ఎస్పీకి విన్నవించుకుంటున్నా పట్టించుకోలేదని అన్నారు. ఇప్పటికైనా తమ ఎమ్మెల్యే తీరుపై చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముంజేటి కృష్ణ మాట్లాడుతూ దళిత మహిళా ఉద్యోగినిపై ఎమ్మెల్యే కూన రవి కార్యకర్తలు అసభ్యంగా ట్రోల్స్ చేస్తున్నారని, జిల్లా టీడీపీ నాయకులు, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పొన్నాడ రుషి మాట్లాడుతూ కూన రవి పాలన నీచాతినీచమని అన్నారు.



సౌమ్యను పరామర్శిస్తున్న నాయకులు

సౌమ్యకు పరామర్శ

శ్రీకాకుళం: రిమ్స్‌లో చికిత్స పొందుతున్న పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్యను శ్రీకాకుళం కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు బి.మురళి, సీఐటీయూ జిల్లా కోశాధికారి అల్లు సత్యనారాయణ, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు సోమవారం సాయంత్రం పరామర్శించారు. బాధితురాలిపై సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్‌ను తక్షణమే ఆపాలని కోరారు. అలాగే మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు లోపింటి తేజేశ్వరరావు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నగర అధ్యక్షుడు కానుకూర్తి గోవిందలు కూడా ఆమెను పరామర్శించారు.

ఇంకేం అర్హత కావాలి..?

దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లపై సర్కారు కన్ను పడింది. ఎలాగైనా లబ్ధిదారుల సంఖ్య తగ్గించాలని రీవెరిఫికేషన్‌పెడుతోంది. ఈ రీ వెరిఫికేషన్‌కు హాజరు కాలేని దివ్యాంగులు తమ పింఛన్ పోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. -నరసన్నపేట



నరసన్నపేట మండలం సత్యవరానికి చెందిన బెండి అక్షిత్ స్కూల్లో నాల్గో తరగతి చదువుతున్నాడు. రెండు కాళ్లు వంకర తిరిగి ఉంటాయి. కొద్ది క్షణాలైనా నించోలేడు. ఈ బాలుడికి ఇదివరకు పింఛన్ వచ్చేది. రీ వెరిఫికేషన్‌లో ఈ బాలుడికి పింఛన్‌కు అర్హత లేదని తేల్చేశారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.ఒకరి సాయం ఉంటే గానీ ముందుకు కదల్లేని తమ బిడ్డ పింఛన్‌కు అర్హుడు కాదా అని ప్రశ్నిస్తున్నారు.



ఇక గొట్టిపల్లి పంచాయతీ రెడ్డికి పేటకు చెందిన కోరెడ్డి మాధవరావుకు పింఛనే జీవనాధారం. ఇతనికి ఒక చెయ్యి, కాలు సక్రమంగా పనిచేయవు. ఏ పనికీ వెళ్లలేరు. ఇంటి పట్టునే ఉంటే పింఛన్ డబ్బుతో బతుకుతున్నారు. గతంలో జెమ్స్ ఆస్పత్రి వైద్యులు గతంలో 57 శాతం వైకల్యం ఉందని సర్టిఫికెట్ ఇచ్చారు. ఇప్పుడు రీ వెరిఫికేషన్‌లో తీసేశారు. మాధవరావుకు ఆధారం ఎలా అని కుటుంబ సభ్యులు వాపోతున్నారు.



జిల్లా కేంద్రం సమీపంలోని పెదపాడు జాతీయ రహదారిపై పల్లెవెలుగు బస్సులోకి వాన నీరు చేరడంతో రోడ్డుపైనే ఆగిపోయింది. ఇలా ప్రయాణికులే కిందకు దిగి తోయాల్సి వచ్చింది.

తడిసి ముద్దయింది

- జిల్లావ్యాప్తంగా విస్తారంగా వానలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నేడు కూడా వానలు కురిసే అవకాశం

శ్రీకాకుళం పాత బస్టాండ్ : చాలాకాలం తర్వాత సిక్కోలు తడిసి ముద్దయ్యింది. బంగాళాఖాతంలో అల్ప పీడనం కారణంగా మూడు రోజులుగా జిల్లాలో విస్తారంగా వానలు పడుతున్నాయి. సోమవారం జల్లులు మరింత ఎక్కువయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం ఒడిశా-ఆంధ్రా సరిహద్దులో అల్పపీడనం తీరం దాటే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దీని ప్రభావంతో వానలతో పాటు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపారు. మంగళవారం వానలు కొనసాగుతాయని, ఒకటి రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. వర్షాలు కొనసాగుతుండడంతో జిల్లా యంత్రాంగం కంట్రోల్ రూమ్‌లను కొనసాగిస్తోంది.

789 మిల్లీమీటర్ల వర్షం..

జిల్లాలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 789 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఎక్కువగా కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం, హిరమండలం, శ్రీకాకుళం, పోలాకి, జలుమూరు, గార, ఆమదాలవలస మండలాల్లో వాన కురిసింది. ఆదివారం 1334 మిల్లీమీటర్లు, శనివారం 398.6 మిల్లీమీటర్ల వాన పడింది.

నిలకడగా నదులు

ప్రస్తుతం జిల్లాలో ప్రధాన నదులు నిలకడగా ఉన్నాయి. వంశధార, నాగావళి క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు పడుతున్నాయి. మరో రెండు రోజులు పడితే వరద వచ్చే అవకాశం ఉంది. వానల నేపథ్యంలో ఉద్యోగులకు అవుట్‌స్టేషన్ సెలవులు మంజూరు చేయబోమని కలెక్టర్ స్పష్టం చేశారు.

అత్యవసర సమీక్ష..

వానలపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఆర్అండ్‌బీ, ఫైర్, ఈపీడీసీఎల్ తదితర శాఖలు పూర్తి అప్రమత్తంగా ఉండాలని, కంట్రోల్ రూమ్ నిరంతరం కొనసాగాలని ఆదేశించారు. ఒడిశా అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమాచారాన్ని సేకరించాల్సి ఉందని చెప్పారు. వైద్యారోగ్య శాఖ మందులు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఉద్దానం ప్రాంతంలో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, రాబోయే 24 గంటలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. వానలపై కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఢిల్లీ నుంచి ఆరా తీశారు. కలెక్టర్‌తో మాట్లాడి ప్రతి ఆరు గంటలకు తనకు నివేదికలు పంపించాలని ఆదేశించారు.

నీట మునిగిన కాంప్లెక్స్

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నీట మునిగింది. ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. సాయంత్రం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కాంప్లెక్స్‌లోని నీటిని తోడించే ఏర్పాట్లు చేశారు. - శ్రీకాకుళం అర్బన్



ఉధ్భతంగా మహేంద్ర తనయ

భారీవానలకు మహేంద్ర తనయ ఉధ్భతంగా ప్రవహిస్తోంది. పెద్దలోగిడి, సింగుపురం, లాబర, కొరసవాడ, బోరుబద్ర, గంగువాడ, ఆర్.ఎల్.పురం, చాకిపల్లి, రొంపివలస, కాగువాడ తదితర గ్రామాలకు చెందిన రైతుల పొలాలు మునిగిపోయాయి. -పాతపట్నం



శ్రీకాకుళంలోని పాత బ్రిడ్జి వద్ద నాగావళి పరవళ్లు

కూలిన ప్రసాదాల విక్రయ శాల

అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయం ముందు ఆదివారం వంటి పర్వదినాల్లో భక్తులకు ప్రసాదాలను విక్రయించే జింకు పైపుల శాల ఒక్కసారిగా కూలిపోయింది. భారీ వర్షం కారణంగా శాలపై వేసిన పై కప్పుపై అధికంగా వర్షపు నీరు నిలిచిపోవడంతో పాటు గాలులకు పైపులన్నీ వంగిపోయి పైకప్పు కుంగిపోవడంతో మొత్తం శాల (షెడ్) కూలిపోయింది. అయితే ఆ సమయంలో భక్తులెవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అయితే ఈమేరకు పునర్నిర్మాణ చర్యలు చేపట్టాలని ఆలయ ఈఓ కేఎస్‌వీడీవీ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు పనులు సోమవారం సాయంత్రం నుంచి మొదలయ్యాయి. -అరసవల్లి



విరిగిన పైపులు, పైకప్పు



మెళియాపుట్టి: గోకర్ణపురం గ్రామానికి వెళ్లే దారిలో ఉప్పొంగి ప్రవహిస్తున్న రాధాసాగరం గెడ్డ

ముందుకొచ్చిన సంద్రం



ఎడతెరిపి లేని వానతో అక్కుపల్లి శివసాగర్, మోట్టూరు, నువ్వలరేవు, డోకులపాడు తీరాల్లో కడలి కల్లోలంగా మారింది. సముద్రం ముందుకు దూసుకురావడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.-వజ్రపుకొత్తూరు రూరల్

శ్రీకాకుళం రూరల్: జిల్లాకేంద్రం సమీపంలోని పాత్రునివలసలో నీట మునిగిన పొలాలు



అన్నదాత ఆగ్రహం



వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలోనే రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని సోమవారం టెక్కలిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో రైతులంతా జోరు వానలో పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. కూటమి కార్యకర్తల ఎరువుల దోపిడీ అరికట్టాలని, రైతుల బీమాను ప్రభుత్వమే చెల్లించాలని, రైతులకు సరిపడా ఎరువులు అందజేయాలని, శివారు ప్రాంతాల రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

- టెక్కలి

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో న్యాయమూర్తి తుహిన్ కుమార్



జస్టిస్ తుహిన్‌కుమార్‌కు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గేదెల తుహిన్ కుమార్ సతీసమేతంగా సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సాంప్రదాయం ప్రకారం ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవంగా పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. వారి గోత్రనామాలతో ప్రత్యేక పూజలను చేయించి, ఆలయ విశిష్టతను శంకరశర్మ వివరించారు. అనంతరం అనివెట్టి మండపంలో వేదాశీర్వచనాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. వారితో పాటు జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి హరిబాబు, ఆర్డీవో సాయి ప్రత్యూష తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాద స్థలంలో పవన్ కుమార్ మృతదేహం

రణస్థలం: లావేరు మండలంలోని తాళ్లవలస జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. లావేరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జిల్లాలో జలుమూరు మండలంలోని గోటివాడ గ్రామానికి చెందిన ముక్త పవన్ కుమార్ (25) విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నాడు. గత రెండు రోజులు సెలవులు కావడంతో ఇంటికి వచ్చి ద్విచక్ర వాహనంపై విశాఖపట్నం తిరుగు ప్రయాణమయ్యాడు. జాతీయ రహదారిపై సోమవారం ఉదయం 10 గంటల సమయంలో లావేరు మండలంలోని తాళ్లవలస వచ్చేసరికి ముందు వెళ్తున్న ఆటో సడన్‌గా రోడ్డుపై నీరు ఉందని తిప్పాడు. దీంతో ఆటోను తప్పించి అధిగమించే క్రమంలో వెనువెంటనే వెనుక వచ్చిన వ్యాను బలంగా ఢీకొట్టింది. దీంతో పవన్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి తండ్రి నరిసింగరావు, తల్లి ఉషారాణి, సోదరుడు సాయి ఉన్నారు. రోడ్డు ప్రమాదంపై లావేరు ఎస్‌ఐ జి.లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చీమలమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

రణస్థలం: మండలంలోని తెప్పలవలస పంచాయతీ పరిధి సీతారాంపురం గ్రామానికి చెందిన మాలుగు రమణ(44) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. జేఆర్ పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రమణ ఈనెల 15వ తేదీన చీమలమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మద్యానికి బానిస కావడం వలన ఇంట్లో కుటుంబ సభ్యులు మందలించారనే కారణంతో చీమల మందు తాగినట్లు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. జేఆర్ పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిమ్స్‌లో యువకుడి అనుమానాస్పద మృతి



బాత్‌రూమ్ వద్ద జారిపడిన అక్కయ్య

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో ఒక యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. లావేరు మండలం మురపాక గ్రామానికి చెందిన మురపాక అక్కయ్య (30) పచ్చ కామెర్ల వ్యాధితో ఇటీవల చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రిలో చేరాడు. సోమవారం మధ్యాహ్నం ఎమర్జెన్సీ వార్డు సమీపంలో ఉన్న బాత్రూమ్ వైపు అక్కయ్య వెళ్లాడు. తిరిగి వస్తుండగా జారిపడి స్పృహ కోల్పోయాడు. అక్కడికి కొద్ది సమయంలోనే వైద్యులు చనిపోయినట్లు నిర్ధారించినా మృతికి గల కారణాలు తెలియరాలేదు. రోగి కుటుంబ సభ్యులు బాత్రూమ్‌కు వెళ్లక ముందు బాగానే ఉన్నాడని, ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదని వాపోతున్నారు. ఇదే విషయమై అవుట్ పోస్టు పోలీసుల వద్ద మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా వైద్యులు సాధారణ మరణంగా ధ్రువీకరించి పంపించేశారన్నారు. బాత్రూమ్‌లో పడిపోవడం వాస్తవమేనని పేర్కొన్నారు.

పొందూరు ఖాదీ... శిక్షణతో ఖ్యాతి..!

- పొందూరు ఏఎఫ్‌కేకేకు సువర్ణావకాశం
- శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కేవీఐసీ సుముఖం
- అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ



పొందూరు ఖాదీ వస్త్రాలు



ఏఎంసీ, ఎన్‌ఎంసీ దారాలు తయారు చేసే వ్యవస్థ

పొందూరు: వేసవిలో చల్లదనం.. శీతాకాలంలో వెచ్చదనం ఇవ్వడం పొందూరు ఖాదీ వస్త్రాల ప్రత్యేకత. ఈ దుస్తులు ఎంతో సౌకర్యవంతంగా, హుందాగా ఉంటాయి. అతి సామాన్యుల నుంచి ఉన్నతవర్గాల వరకూ ప్రతి ఒక్కరూ ధరించేందుకు వీలుగా అందుబాటు ధరల్లో లభిస్తాయి. మహాత్మా గాంధీ నుంచి ప్రస్తుత రాజకీయ నాయకుల వరకు ఎంతోమంది పొందూరు ఖాదీకి అభిమానులు ఉన్నారు. ఈ ఫైన్ ఖాదీ(సన్నఖాదీ) తయారీకి ప్రత్యేకంగా శ్రీకాకుళం జిల్లాలో మాత్రమే పండించే కొండ పత్తిని ఇక్కడ ఉపయోగిస్తారు. దశాబ్దాల కాలం నుంచి పొందూరు ఏఎఫ్‌కేకే సంఘం అనేది ఖాదీ విలేజ్ ఇండస్ట్రీ కమిషన్(కేవీఐసీ) ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఈ సంఘాన్ని కేవీఐసీ సౌత్‌జోన్ డిప్యూటీ సీఈవో మదన్‌కుమార్ రెడ్డి ఇటీవల సందర్శించారు. దీనిలో భాగంగా సంప్రదాయ ఖాదీ వస్త్రాల తయారీ కేంద్రం మరిన్ని కాలాలు విరజిల్లాలని ఆకాంక్షిస్తూ తన పరిధిలో హామీలనిచ్చారు. ఖాదీ ప్రమోషనల్ గ్రాంట్ నుంచి అవసరమైన పరికరాల కొనుగోలుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. వర్క్‌షెడ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నామని, పొందూరు ఏఎఫ్‌కేకే సంఘంతో కేవీఐసీ కలిసి కొత్తగా నైపుణ్యాలపై శిక్షణా కేంద్రం నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కేవీఐసీ, జీఎంఆర్ సంయుక్తంగా విలేజ్ ఇండస్ట్రీస్ కింద శిక్షణ ఇస్తున్నారని చెప్పారు. ఖాదీని ముందు తరాలకు అందించేందుకు ఆ అవకాశాన్ని పొందూరు ఏఎఫ్‌కేకే సంఘం దక్కించుకోవాలని సూచించారు.

శిక్షణతో ఉపాధి

చేనేత వస్త్ర తయారీలో శిక్షణ ఇవ్వడం వలన నిరుద్యోగులకు ఉపాధి చేకూరుతుంది. నెలకు దాదాపు రూ.15 వేలు నుంచి రూ.25 వేలు వరకు సంపాదించుకునే అవకాశం ఉంటుంది. స్పిన్నింగ్, వీవింగ్‌లో శిక్షణ పొందిన వారంతా సంఘాలకు, సొసైటీలకు దుస్తులు నేస్తూ ఉపాధి పొందుతారు. వాస్తవానికి స్పిన్నర్లు, వీవర్లు, సంఘం ఉద్యోగులకు ఆదాయం పెంచుకునేందుకు అవకాశాలు ఉన్నాయి. కేవీఐసీ ఎండీఏ సిస్టంలో ఉత్పత్తిపై 35 శాతం మొత్తాన్ని ప్రతీ మూడు నెలలకు ఒకసారి స్పిన్నర్లు, వీవర్లు, ఉద్యోగులకు అందిస్తుంది. ఇదేకాకుండా సంఘాలు మజూరీని అందజేస్తున్నాయి. కొత్త కార్మికులు సంఘంలో చేరి దుస్తులు నేస్తే మరింత ఆదాయం పొందే అవకాశం మెండుగా ఉంది.

సొసైటీలకు సహకారం అందాలి

అయితే వాస్తవానికి సొసైటీలు, సంఘాలకు దుస్తులు నేసే వారికంటే మాస్టర్ వీవర్స్ దగ్గర ఎక్కువ కార్మికులు ఉండడం గమనార్హం. మాస్టర్ వీవర్స్ నేసే వారికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. ఈ పరిస్థితి మారాల్సిన అవసరం ఉంది. సొసైటీలు, సంఘాలకు నేసేవారికి ప్రభుత్వ సహకారం అందించాలి. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి. ఉచిత విద్యుత్, ఆరోగ్య బీమా, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ వంటివి సొసైటీలు, సంఘాలకు నేసే కార్మికులకు వర్తింపజేయాలి. దుస్తులు నేసే వారికి షరతులు ఉండకూడదు. ఉదాహరణకు పొందూరు ఏఎఫ్‌కేకే సంఘంలో ఏఎంసీ, ఎన్‌ఎంసీ వస్త్రాలు మాత్రమే లభిస్తున్నాయి. సీమనూలుతో నేసే వస్త్రాల తయారీ ఇక్కడ లేదు. అందువలన ఏరకమైన నూలుతోనైనా వస్త్రాలు తయారు చేయొచ్చన్న అనుమతి కేవీఐసీ నుంచి రావాలి. తద్వారా ఉత్పత్తి పెరుగుతుంది. కార్మికులకు ఆదాయం పెరుగుతుంది. కొత్తవారు ఈ రంగంలోకి వచ్చేందుకు మొగ్గు చూపుతారు.


సమయం ఆసన్నమైంది

అంతరించిపోతున్న ప్రాచీన, సంప్రదాయ వస్త్ర తయారీ ప్రక్రియను బతికించేందుకు ఏఎఫ్‌కేకే సంఘం వడుకు, నేత ప్రక్రియలను నేర్పే శిక్షణా సంస్థగా అవతరించాల్సిన తరుణం ఆసన్నమైంది. ఆ మేరకు ఏఎఫ్‌కేకే సంఘం త్వరగా కేవీఐసీ సాయంతో శిక్షణలు ఇచ్చేందుకు భాగస్వామ్యం కోసం అడుగులు వేయాలి. పొందూరులో గతంలో 1,200 మంది స్పిన్నర్లు ఉండేవారు. ప్రస్తుతం వారి సంఖ్య 520 మందికి చేరింది. గతంలో 300 మంది నేత కార్మికులు ఉండేవారు. ప్రస్తుతం కేవలం 80 కుటుంబాలు మాత్రమే నేత కార్మికులుగా మిగిలారు. ఏళ్లు గడుస్తున్న కొద్దీ కార్మికులు తగ్గిపోతున్న నేపథ్యంలో కొత్తవారు ఈ రంగంలోకి రావాల్సిన అవసరం ఏర్పడింది. దీని కోసం శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.



పొందూరు ఏఎఫ్‌కేకే సంఘం

శిక్షణ ఇచ్చేందుకు సిద్ధం



కేవీఐసీ డిప్యూటీ సీఈవో మదన్‌మోహన్‌రెడ్డి పొందూరు ఏఎఫ్‌కేకే సంఘాన్ని సందర్శించి హామీలివ్వడం వాస్తవమే. కొత్తవారికి వడుకు, నేత ప్రక్రియలపై శిక్షణలు ఇచ్చేందుకు కేవీఐసీకి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణలిచ్చేందుకు ఏఎఫ్‌కేకే సంఘం సిద్ధంగా ఉంది.

– దండా వెంకటరమణ, సెక్రటరీ, ఏఎఫ్‌కేకే సంఘం, పొందూరు

అనుమతులిస్తాం

ఖాదీ వస్త్రాలు తయారు చేసేందుకు పొందూరు ఏఎఫ్‌కేకే సంఘాన్ని కేవీఐసీతో ట్రైనింగ్ పార్టనర్‌గా ఉండమని సూచించాం. పొందూరు ఖాదీని ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దీనివలన కొత్తతరం వారు ఈ వృత్తిలో కొనసాగేందుకు అవకాశం ఉంటుంది. కొత్తగా వడుకు, నేత ప్రక్రియలో శిక్షణ ఇచ్చేందుకు పొందూరు ఖాదీ సంస్థకు దరఖాస్తు చేయమని చెప్పాను. శిక్షణ ముగించుకున్న వారికి సర్టిఫికెట్లు సైతం అందజేస్తాం. ఏ జిల్లా నుంచైనా శిక్షణలకు పొందూరుకు రావచ్చు. వడుకు, నేత పని నేర్చుకోవచ్చు.

– మదన్‌కుమార్ రెడ్డి, డిప్యూటీ సీఈవో, బెంగుళూరు, కేవీఐసీ

ఈసీ తీరు బాధాకరం

- కొవ్వొత్తులతో కాంగ్రెస్ నాయకుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: దేశంలో రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన ఎలక్షన్ కమిషన్, కేంద్రంలో బీజేపీకి అనుకూలంగా పనిచేస్తుండడం బాధాకరమని, ప్రజాస్వామ్యాన్ని పాతరేసేలా పనిచేస్తున్న ఎన్నికల కమిషన్ తీరును దేశ పౌరులంతా గుర్తించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదం వెంకట త్రినాథరావు, అంబటి కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో సోమవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరా విజ్ఞాన్ భవన్ నుంచి మున్సిపల్ ఆఫీస్ గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ద్వారా పౌరులకు సంక్రమించిన ఓటుహక్కును కేంద్రంలో ఉన్న బీజేపీ దొంగలించి దొడ్డిదారిలో అధికారం చేపట్టడం శోచనీయమన్నారు.

స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ సంస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని రాజకీయ స్వలాభం కోసం కేంద్ర ప్రభుత్వం వాడుకుంటోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సైదుల్లాఖాన్, అంబటి లక్ష్మణరావు, తెంబూరు మధుసూదనరావు, అంబటి దాలినాయుడు, చాన్ భాష, మామిడి సత్యనారాయణ, ఆబోతుల వెంకట నాయుడు, బొచ్చ వెంకటరమణ, ఆదినారాయణ, బగ్గ రాము, సురియా బేగం తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 78 వినతులు



పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు సోమవారం నిర్వహించారు. ప్రజల నుంచి నేరుగా అందిన ఫిర్యాదులను శాఖల వారీగా సమీక్షిస్తూ, సమస్యల తక్షణ పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు కారణంగా ఈ వారం తక్కువగా వినతులు వచ్చాయి. ఈ వారం మొత్తం 78 ఫిర్యాదులు వివిధ శాఖలకు అందగా, వాటిలో రెవెన్యూ శాఖకు అత్యధికంగా 14 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగానికి సంబంధించి 11, గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘానికి చెందిన 10, పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి 7, వ్యవసాయ శాఖకు చెందిన 6, మున్సిపల్ పరిపాలన శాఖకు సంబంధించి 6 ఫిర్యాదులు నమోదయ్యాయి. జిల్లా కేంద్రంలోని ధర్మక్షేత్రనగర్‌లో నివాస గృహాలకు బదులుగా, ప్రైవేటు మెడికల్ కళాశాలకు సంబంధించిన తరగతి గదుల నిర్మాణం గుట్టుచప్పుడు లేకుండా చేపడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో తక్షణమే స్పందించిన జేసీ శ్రీకాకుళం కార్పొరేషన్ అధికారులు యజమానిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే రిమ్స్ సెక్యూరిటీ గార్డులకు బకాయిపడ్డ వేతనాలు చెల్లించాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌కు రిమ్స్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 47 వినతులు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు 47 వినతులు ప్రజల నుంచి అందాయి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

రోడ్డు ప్రమాదంలో యువతీ యువకుల దుర్మరణం

పీఎం పాలెం: బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో యువతీ యువకులు దుర్మరణం చెందారు. సోమవారం రాత్రి 7 గంటల సమయంలో చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ ఎదురుగా హైవేపై చోటుచేసుకున్న ఈ దుర్ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. నగర పరిధిలోని జోడుగుళ్లపాలేనికి చెందిన వాసుపల్లి దాసుకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు వాసుపల్లి సతీష్(19) భవన నిర్మాణ సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. అప్పుడప్పుడు చేపలుప్పాడలో ఉంటున్న తాతగారి ఇంటికి వెళుతుంటాడు. పలాసకు చెందిన ఉష(18)తో యువకుడికి పరిచయం ఉంది. తనను కలుసుకోవడానికి వచ్చిన ఆమెతో డ్యూక్ బైక్‌పై బయటకు వెళ్లాడు. తాతగారి ఇంటి నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు వీరిద్దరూ పరదేశిపాలెం మీదుగా బయల్దేరారు. చంద్రంపాలెం హైస్కూల్ ఎదురుగా హైవేపైకి వచ్చేసరికి ముందు వెళ్తున్న బస్సు, లారీలను తప్పించబోయి లారీకి బైక్ తగలడంతో కింద పడిపోయారు.

ఇద్దరికీ తలకు బలమైన గాయాలై సంఘటనా స్థలంలోనే మరణించారు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్‌ఐ రాము తెలిపారు.

రోడ్డెక్కితే.. చలానా వాతే..!



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు(ఫైల్)

- జిల్లాలో లక్షకు పైగా డెలివరీ కాని ఆర్సీ, లైసెన్స్ కార్డులు
- డిజిటల్‌గా చూపించినా కేసులు నమోదు
- లబోదిబోమంటున్న వాహన చోదకులు

వజ్రపుకొత్తూరు: రోడ్డెక్కుతున్న వాహన చోదకులను దోచుకునేందుకు కూటమి ప్రభుత్వం మాస్టర్ స్కెచ్ వేసింది. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డుల పేరుతో రూ.కోట్లను ఖజానాలో వేసుకుంటోంది. వాస్తవానికి ఈ కార్డులు సక్రమంగా జారీ అవ్వడం లేదు. దీంతో వాహనదారులు డిజిటల్ కార్డులనే ఉపయోగిస్తున్నారు. ఈ కారణంగానే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాహనదారులకు కార్డుల భారం లేకుండా డిజిటల్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ఫిజికల్‌గా కార్డు లేకపోయినా.. డిజిటల్ కార్డులతో ఎటువంటి ఇబ్బందీ లేకపోయేది. అయితే టెక్నాలజీకి తానే ఆద్యుడునని చెప్పుకునే సీఎం చంద్రబాబు తిరిగి ఫిజికల్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

కార్డుల కోసం డబ్బులు చెల్లించినా...

డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డుల విషయంలో వాహనదారుల పరిస్థితి సంకటంగా మారింది. కార్డుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి డబ్బులు చెల్లించినా జారీ చేయని పరిస్థితి ఉంది. రవాణా శాఖలో సేవలను సులభతరం చేశామని, కార్యాలయానికి రాకుండానే అన్ని సేవలు పొందవచ్చునని చెబుతున్న కూటమి ప్రభుత్వం, లైసెన్స్, ఆర్సీ కార్డుల కోసం రవాణా కార్యాలయాలు చుట్టూ తిప్పుకుంటోంది. వాహనం రోడ్డెక్కితే చాలు లైసెన్సు, ఆర్సీలు చూపించమని అటు రవాణా శాఖ, ఇటు పోలీసు అధికారులు దబాయిస్తున్నారు. కార్డుల కోసం డబ్బులు చెల్లించామని, కార్డులు ఇంకా ఇవ్వలేదని చెప్పినా చలానా రాసి చేతిలో పెడుతున్నారని వాహనదారులు వాపోతున్నారు. కొంతమంది డిజీ వ్యాలెట్ యాప్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న కార్డును చూపిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఫిజికల్ కార్డు ఉంటే చూపించు వదిలేస్తామని స్పష్టం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో...

జిల్లాలోని పెద్దపాడు ప్రాంతంలో ప్రధాన రవాణా శాఖ కార్యాలయంతో పాటు శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురంలలో రవాణా శాఖ కార్యాలయాలు ఉన్నాయి. ప్రతిరోజూ జిల్లావ్యాప్తంగా సగటున 350కు పైగా వాహన రిజిస్ట్రేషన్లు, పర్మినెంట్ లైసెన్సులు జారీ చేస్తుంటారు. ఫిజికల్ కార్డుల కోసం ప్రభుత్వం అదనంగా ప్రతీ కార్డుకు రూ.235 వసూలు చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాహనదారులపై కార్డుల భారం తొలగించి డ్రైవింగ్ లైసెన్సు, ఆర్సీ కార్డులను సెల్‌ఫోన్ వ్యాలెట్ యాప్‌లో అందుబాటులో ఉంచింది. పోలీసు, రవాణా అధికారులు అడిగినపుడు సేవ్ చేసుకున్న కార్డు చూపిస్తే సరిపోతుంది. పొరపాటును కార్డును మరిచిపోతే వాహన చోదకులపై చలానాలు రాసే పరిస్థితి ఉండకుండా డిజిటల్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది.

ఖజానా నింపేందుకే..

సంపద సృష్టిస్తానని చెప్పిన సీఎం చంద్రబాబు ఇలా వాహన చోదకులను దోచుకోవడం ద్వారా ఖజానా నింపేందుకు స్కెచ్ వేశారు. టెక్నాలజీకి తానే ఆద్యుడునని గొప్పలు చెప్పుకునే ఆయన గత ప్రభుత్వం తీసుకొచ్చిన డిజిటల్ విధానానికి స్వస్తి పలికి వాహనదారులను దోచుకుంటున్నారు. గతేడాది నవంబర్ నుంచి కార్డుల జారీ కోసం ప్రత్యేక డబ్బులు తీసుకోవడం ప్రారంభించారు. లైసెన్సు జారీ, రిజిస్ట్రేషన్ సమయంలో ప్రభుత్వ చలానాతో పాటు కార్డుకు ప్రత్యేకంగా రూ.235 ప్రత్యేకంగా చెల్లిస్తున్నారు. గతేడాది నవంబర్ నుంచి డబ్బులు చెల్లించిన వాహనదారులకు ఇంతవరకు కార్డులు అందలేదు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు లక్షకుపైగా లైసెన్సు, ఆర్సీ కార్డులు రావాల్సిందని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. దాదాపు డ్రైవింగ్ లైసెన్సు, ఆర్సీ కార్డుల కోసం రూ.1.766 కోట్లుకు పైగా డబ్బులు చెల్లించడం గమనార్హం.

కార్డులు రావాల్సి ఉంది

డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డులు విజయవాడలో ముద్రించి రావాల్సి ఉంది. 2024 నవంబర్ నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. కార్డుకు రూ.235 వసూలు చేస్తున్నాం. సగటున రోజుకు జిల్లావ్యాప్తంగా 250 వరకు కార్డులు నమోదు అవుతున్నాయి. కార్డులు వచ్చిన వెంటనే వారి చిరునామాలకు పంపిస్తాం. కార్డుల కోసం రవాణా కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదు.

– విజయసారధి, డీటీసీ, శ్రీకాకుళం

బురదమయంగా తాగునీరు



కుళాయి ద్వారా వచ్చిన బురద నీరు



కుళాయి నీటిని పడుతున్న గిరిజన మహిళలు

మెళియాపుట్టి: మండలంలోని సవర మర్రిపాడు గిరిజన గ్రామంలో తాగునీరు బురదమయంగా వస్తుండడంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో ఉన్న సుమారు 50 కుటుంబాలు కుళాయి ద్వారా వస్తున్న బురదనీరు తాగడం వలన రోగాలబారిన పడుతామని ఆందోళన వ్యకం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మరో 17 బార్‌ల ఏర్పాటుకు సన్నాహాలు

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ముగింపు ఈనెల 26న, లాటరీ 28న
- ఎక్సైజ్ కొత్త మద్యం పాలసీ ప్రకారం ఏర్పాటు
- వివరాలు వెల్లడించిన జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి



పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ శ్రీకాంత్‌రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో 17 బార్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశానుసారం తమ విభాగం కొత్త మద్యం పాలసీని ప్రవేశపెట్టిందని శ్రీకాకుళం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ (డీసీ) దోసకాయల శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని మెడికవర్ ఆస్పత్రి సమీపంలో ఉన్న కార్యాలయంలో డీసీ విలేకరులతో మాట్లాడారు. మూడేళ్ల కాలపరిమితికి లోబడి గెజిట్ నోటిఫికేషన్ విడుదలైందని, శ్రీకాకుళం కార్పొరేషన్ (11), పలాస మున్సిపాలిటీ (2)ల పరిధిలోని 13 బార్లకు ఏడాది రీటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (లైసెన్సు) ఫీజుగా రూ. 55 లక్షలుగా నిర్ణయించామన్నారు. ఆమదాలవలస(02), ఇచ్ఛాపురం(02) మున్సిపాలిటీలకు రూ. 35 లక్షలు లైసెన్సు ఫీజు అని ఆరుదఫాలుగా ఫీజును చెల్లించవచ్చన్నారు. దరఖాస్తులు నేటినుంచి ఆన్‌లైన్, హైబ్రిడ్, ఆఫ్‌లైన్‌లో స్వీకరిస్తామని, ఈ నెల 26 సాయంత్రం 5 గంటల వరకు చివరి గడువు అన్నారు. దరఖాస్తు రుసుం రూ. 5 లక్షలని, ప్రాసెసింగ్ ఫీజు మరో రూ.10 లక్షలని, డీడీ చలానాల ద్వారా చెల్లించేవారు, సంబంధిత కార్యాలయానికి వచ్చేవారు డీపీఈఓ ఆఫీస్ పేరిట చలానా కట్టాలన్నారు. ఒక్కో బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు రావాలని, లేదంటే తదుపరి నోటిఫికేషన్ వరకు వేచి ఉండాల్సిందేనన్నారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చని, ఎన్ని బార్లకైనా పెట్టుకోవచ్చని స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లాలోని శ్రీకాకుళం, పలాస పరిధిలో ఉన్న లైసెన్సుదారుల మద్యం దుకాణాలకు వచ్చే అక్టోబరు నుంచి రూ. 79 లక్షల లైసెన్సు ఫీజుగా ఉంటుందని, ఇచ్ఛాపురం, ఆమదాలవలస మున్సిపాలిటీల పరిధి దుకాణాలకు రూ. 65.5 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించిందని, వాటితో పోల్చుకుంటే బార్లకు తక్కువ ఫీజేనన్నారు. ఈ నెల 28న జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ ఆడిటరియంలో లాటరీ పద్ధతిన బార్లు కేటాయిస్తామన్నారు.

కొత్త బార్ల పాలసీ మొదలయ్యాక ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 వరకు అమ్మకాలకు అనుమతినిస్తున్నట్లు చెప్పారు. బార్లకు అనుసంధానంగా రెస్టారెంట్లను పెట్టుకునేందుకు 15రోజులు అదనంగా లైసెన్సుదారులకు గడువిస్తామని అన్నారు. జిల్లాలో ఉన్న 176 మద్యం దుకాణాలకు ఇప్పటికే పక్కనే పర్మిట్ రూమ్‌లకు అనుమతిలిచ్చామని దీని ప్రకారం నీరు, ఫుడ్‌ప్యాకెట్లు అమ్మకాలు, మద్యం తాగేందుకు వీలుంటుందన్నారు. సమావేశంలో డీసీతో పాటు జిల్లా ఎక్సైజ్ అధికారి తిరుపతినాయుడు, సీఐ గోపాలకృష్ణ, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.